# షాక్

"రండి, మాకార్లో డ్రాప్ చేస్తాం మిమ్మల్ని...." అంది మిసెస్ గీత ప్రోగ్రామ్ అయిపోయి బయటికి వస్తుంటే రజితతో.

"ఓ; థాంక్యూ" అంటూ మిసెస్ గీతతో పాటు కారు దగ్గరకు వచ్చింది రజిత.

ఆ ఇద్దరికీ ఎక్కువ పరిచయం లేదు. ఏ ఒకటి రెండు సార్లో ఇట్లా ఏదో ప్రోగ్రామ్‌లో కలుసుకున్నారు. మిసెస్ గీతకు ఎక్కువగా మాట్లాడే అలవాటు లేదు. కానీ, రజిత మాత్రం చాలా ఎక్కువగా మాట్లాడుతుంది.

రవీంద్ర భారతిలో కూడా ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. నృత్య కార్యక్రమం చాలా బాగుంది. గీత పూర్తిగా ఆ నాట్యంలో లీనమైపోయింది. కానీ, రజిత మాత్రం ఏదో ఒకటి కామెంట్ చెయ్యడం చాలా విసుగు కలిగించింది. రజిత పెద్ద పొజిషన్‌లో ఉన్న లేడీ. అందుకని మాట్లాడవద్దు అనలేకపోయింది. ఆవిడ మాట్లాడే మాటల్లో గొప్పలు, అతిశయోక్తులు కొల్లలుగా దొర్లుతూనే ఉంటాయి గీత చాలా వరకు ఊఁకొట్టడం తప్ప మాట్లాడలేదు. అసలైతే రజిత చాలావరకు ఎదుటి వాళ్ళకి మాట్లాడే అవకాశం ఇవ్వదు, అదీ ఆమె ప్రత్యేకత.

మిసెస్ గీతతో ఆవిడ కూతురు రేఖ కూడా ఉంది. ఆ అమ్మాయి కూడా మితభాషి. ముగ్గురూ కారు దగ్గరకు వచ్చిన తరువాత రేఖ ముందు సీట్లో కూర్చుంది. గీత, రజిత వెనక సీట్లో కూర్చున్నారు.

"డ్రైవర్ పక్కనెందుకు కూర్చుంటావు? ఇక్కడే కూర్చో?....", అంది అధికారికంగా రేఖను ఉద్దేశించి రజిత. రజితవైపొక్క క్షణం చూసి దృష్టి మరల్చి ముందు సీట్లోనే కూర్చుండిపోయిందామె.

దారి పొడుగునా కూడా ఫుల్‌స్టాప్‌లూ, కామాలు లేకుండా మాట్లాడుతూనే ఉంది రజిత.

"ఏయ్, డ్రైవర్! కారు ఎడమ వైపుకు పోనివ్వు...."

"అబ్బబ్బ! ఈ రోజుల్లో వీళ్ళకి కూడా ఎంత అహంకారమనీ.... కారు వాళ్ళ సొంతమే అన్నంత ధీమాగా ఉంటారు. అదిగో చూశారా! ఆ డ్రైవర్ కారెంత రాష్‌గా నడుపుతున్నాడో-కొంచెమైతే ఆ స్కూటర్ని గుద్దేసేదే.... అసలు వీళ్ళకి ట్రాఫిక్ రూల్సన్నా తెలుసా-అని....గీత గారూ! మీ డ్రైవర్ని వెంటనే మార్చెయ్యాలి సుమా! ఇదేమన్నా రోడ్డనుకుంటున్నాడా తను జాగీర్దారా!-ఈ మధ్య వచ్చే సినిమాలు చూసి వీళ్ళు మరీ పేట్రేగి పోతున్నారు. రిక్షావాడు హీరో, జట్కావాడు హీరో, టాక్సీవాడు హీరో.... ప్రతివాడూ హీరో పోజు కొట్టేవాడే....మీరేం మాట్లాడరేమిటి? ఓహ్! అర్థమైందిలెండి.... గట్టిగా మాట్లాడితే ఈ డ్రైవర్లు పని మానేస్తారు. ఇక మనకి పాట్లు తప్పవని ఊరుకునుంటారు." స్వరం తగ్గించి అంది. "అందుకే వీళ్ళకి పొగరెక్కువవుతుంది. కానీ, మరీ

అంత మెత్తగా ఉండకూడదండీ. మాకారు మొన్నే అమ్మేశాం. ఆఁ! కుడివైపు తిప్పు— కారు పాత మోడలై పోయిందని కొత్త కారు బుక్ చేశాం— ఇంకో పది, పదిహేను రోజుల్లో వచ్చేస్తుంది. మాకారు డ్రైవరు మాత్రం నన్ను చూస్తే వణికిపోతాడు సుమండీ.... ఆఁ.... ఇప్పుడు ఎడమవైపు తీసుకుని ఆ ఆకుపచ్చ గేటు దగ్గర ఆపేయ్.... ఆఁ— ఇక్కడే.... థాంక్యూ, గీతా!...." అంది కారు ఆపిన తరువాత దిగబోతూ రజిత.

అప్పటి వరకూ పూర్తిగా గీత శ్రోతగానే ఉంది. రేఖ కూడా.

డ్రైవర్ కూడా మౌనంగానే ఉన్నాడు.

"అన్నట్లు, రజితా! మాటల్లో పడి నేను పరిచయం చెయ్యడం మర్చేపోయాను. ఇతను మా అల్లుడు శ్రీక్రాంత్-రేఖ హజ్బెండ్" అంది గీత డ్రైవర్ సీట్లో కూర్చున్న వ్యక్తిని చూపిస్తూ. ఆవిడ మొహంలో ఏ భావమూ లేదు. అప్పటికి రజిత కారు దిగి డోర్ వేసింది.

"మా అల్లుడికి ఈ కల్చరల్ ప్రోగ్రామ్స్ అంటే అంతగా ఇంట్రెస్టు లేదు, ఏవో బయటి పనులు చూసుకుని టైమ్‌కి వచ్చి మమ్మల్ని పికప్ చేస్తానన్నాడు— అతను ఇంజనీర్...." గీత చెప్పే మాట లేవీ వినే దశలో లేదు రజిత. పాలిపోయిన ముఖంతో శ్రీకాంత్ వైపు చూస్తుండగానే కారు రివ్వున దూసుకు పోయింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 28-8-'85).